క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



ఆలయంలో పూజలు చేస్తున్న రమేష్ తదితరులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేష్ అన్నారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని గంజ్ ఆవరణలో ఉన్న గణపతి దేవాలయంలో సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బండారి రమేష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాతికత వైపు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వన్నాడ వెంకటేశ్‌గౌడ్, అభిలాశ్, గోపాల్, కత్తి శేఖరప్ప, డాక్టర్ రవికుమార్, ఇప్పలపల్లి సురేశ్, ప్రవీణ్, శ్రీధర్, ఆలయ ట్రస్టు సభ్యులు ఓం ప్రకాశ్,కుమార్,రాజేశ్ మలానీ, అర్చకుడు రాజన్ పండిత్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి గోకులాష్టమి ఉత్సవాలు

షాబాద్: కృష్ణాష్టమి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయ వ్యవస్థాపకులు, చైర్మన్ తాళ్ల సువర్ణ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని దేవాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ.. కృష్ణాష్టమి (గోకులాష్టమి) నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 5వ తేదీవరకు నిర్వహిస్తామన్నారు. 26వ తేదీన అభిషేకం, అర్చన, తీర్థ ప్రసాద వితరణ. 27 నుంచి సెప్టెంబర్ 4వ తేదీవరకు రోజు అభిషేకం, అర్చన, యజ్ఞం, 5వ తేదీన అభిషేకం, అర్చన, యజ్ఞపూర్ణాహుతి, డోలారోహణ పూజలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆడబిడ్డకు చేయూత



తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న శ్రీరాంరెడ్డి

షాబాద్: ఆడబిడ్డ ఇంటికి లక్ష్మీదేవితో సమానమని ఆడబిడ్డకు జన్మించిన ప్రతీ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన కొండపల్లి కార్తీక్, హిందు దంపతులకు ఆడశిశువు సన్మించడంతో వారికి 5వేల 211 రూపాయల నగదు అందజేశారు. తమ గ్రామంలో ఇప్పటివరకు 17 మంది దంపతులకు సాయం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్, రాజు, హన్మంతు, నర్సింలు, రమేశ్, శ్రీధర్, కృష్ణ, బందయ్య, భిక్షపతి, భీమయ్య, తదితరులు ఉన్నారు.

అదానీ కేసులో నిర్లక్ష్యం సరికాదు

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



నిరసన తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

షాబాద్: అదానీ కేసు దర్యాప్తు వ్యవహారాల విషయాల్లో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏఐసీసీ, టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని ఈడీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదానీ వ్యవహారంపై జేపీసీ విచారణను డిమాండ్ చేస్తూ మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకు లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌నాయ క్, శేఖర్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

‘మీ సేవ’ కష్టాలు

- మండలంలో ఒకే కేంద్రం.. మూడున్నరేళ్ల క్రితం ఒకటి సీజ్
- నాలుగేళ్ల క్రితం నిర్వాహకుడు మరణించడంతో మరొకటి మూత
- ప్రజలకు తప్పని తిప్పలు



రెడ్డిపల్లి మీ సేవ కేంద్రం

మొయినాబాద్: అన్ని రకాల ఆన్‌లైన్ సేవల కోసం ప్రతి 5వేల జనాభాకు ఒక మీ సేవ కేంద్రం ఉండాలి. కానీ మండలంలో 70 వేల జనాభాకు ఒకే మీ సేవ కేంద్రం ఉంది. సుమారు మూడున్నర సంవత్సరాలుగా ఈ పరిస్థితి ఉన్నా కొత్త మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

తప్పని ఇబ్బందులు

మొయినాబాద్ మండల ప్రజలు సుమారు మూడున్నర సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం మాత్రం సమస్య తీర్చడంపై దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలం మొత్తానికి ఒకే మీ సేవ కేంద్రం కొనసాగుతుండడంతో ప్రజల కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న మండలంలో ప్రభుత్వం గతంలో మూడు మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో రెండు మీ సేవ కేంద్రాలు మూడున్నర సంవత్సరాల క్రితమే మూతపడ్డాయి. నాలుగు సంవత్సరాల క్రితం హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రం నిర్వాహకుడు మరణించడంతో అది మూతపడింది. అదే విధంగా మూడున్నరేళ్ల క్రితం మొయినాబాద్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేశారు. దీంతో రెడ్డిపల్లిలో ఉన్న మీసేవ కేంద్రం ఒక్కటే మండల ప్రజలకు దిక్కయ్యింది. మండలంలో మరో మీసేవ కేంద్రం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రెడ్డిపల్లి మీసేవ కేంద్రానికే వెళ్లాల్సి వస్తోంది.

నోటిఫికేషన్ ఇచ్చినా..

నాలుగేళ్ల క్రితం నిర్వాహకుడి మరణంతో మూతపడ్డ హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చింది. మీసేవ నిర్వాహణకు దరఖాస్తు చేసుకోవాలని కోరడంతో మండలంలోని చాలా మంది దరఖాస్తు చేసుకుని పరీక్ష సైతం రాశారు. కానీ మీసేవ కేంద్రాన్ని స్థానికులకు కాకుండా స్థానికేతరులకు కేటాయించారని దరఖాస్తు చేసుకుని పరీక్షరాసిన కొంత మంది తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. మరోసారి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు ఇవ్వడం లేదు. మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సీజ్ చేయడంతో నిర్వాహకుడు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చాడు. దీంతో మొయినాబాద్‌లో మీసేవ కేంద్రం నిర్వహించేందుకు స్టే అడ్డంకిగా మారింది.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మండలంలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రతీది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో అందరూ మీ సేవ కేంద్రాలకే వెళ్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, పుట్టినతేదీ సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి తోడు రెవెన్యూకు సంబంధించిన చాలా దరఖాస్తులను మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. దీంతో విద్యార్థులు, రైతులు చాలా మంది రెడ్డిపల్లి మీసేవ కేంద్రం వద్దకే వెళ్లాల్సి వస్తోంది. ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో దరఖాస్తుల కోసం వచ్చిన వారందరూ ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుండడంతో అసహనానికి గురవుతున్నారు. కొంతమంది ఇతర మండలాల్లోని మీసేవ కేంద్రాలకు వెళ్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



మండలంలో ఒకే మీ సేవ కేంద్రం ఉండటంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లిలో మీసేవ కేంద్రం ఉండటంతో చాలా గ్రామాల ప్రజలు అంత దూరం వెళ్లడం ఇబ్బందిగా మారింది. మండలంలో కొత్త మీసేవ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– సంతోష్, సురంగల్, మొయినాబాద్ మండలం

ప్రతిపాదనలు పంపాం



మండలంలో ప్రస్తుతం ఒకే మీసేవ కేంద్రం ఉంది. మండలంలో కొత్తగా మరో నాలుగు మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మీ సేవ కేంద్రాల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

సొంత నిధులతో మోటార్ల బిగింపు

హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



బోర్‌మోటార్‌ను ప్రారంభిస్తున్న దాత శేఖర్

కేశంపేట: తమ గ్రామంలో మంచినీటి ఎద్దడిని నివారించేందుకు దాత ముందుకొచ్చి బోరుమోటార్లను బిగించి సమస్యను తీర్చాడు. మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో గత కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో మంచినీటి ఎద్దడి ఏర్పడింది. ఈ సమస్యను చూసి స్పందించిన గ్రామానికి చెందిన పిప్పళ్ల శేఖర్ సొంత నిధులు లక్ష పది వేల రూపాయలతో గ్రామంలో మూడు సింగిల్ ఫేజ్ మోటార్లను కొనుగోలు చేసి గురువారం వాటిని ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ దాత శేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్‌రెడ్డి, గ్రామస్తులు నీల పాండు, లింగారెడ్డి, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజు, వెంకటయ్య, ఐలయ్య, తిరుపతయ్య, పెంటయ్య, లింగయ్య, లక్ష్మయ్య, మల్లేశ్, చెన్నయ్య, గణేశ్, కృష్ణయ్య, యాదయ్య, రవిగౌడ్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎల్‌ఆర్‌ఎస్’ పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటమాధవరావు

షాద్‌నగర్: ఎల్‌ఆర్‌ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ వెంకటమాధవరావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. సర్వే నంబర్లు, రోడ్డు విస్తీర్ణం, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల భూములు వంటి తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేయొద్దని, క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లే ముందే అధికారులు దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు. షాద్‌నగర్‌లో సుమారు 15వేల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిలో 3వేల దరఖాస్తులు పరిష్కారమైనట్లు మున్సిపల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై విమర్శలు సరికాదు

పీసీసీ అధికారి ప్రతినిధి గౌరీ సతీశ్



మాట్లాడుతున్న సతీశ్

మొయినాబాద్, రూరల్: రాష్ట్రంలో రైతుల పట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మాట్లాడే నైతిక అర్హత లేదని పీసీసీ అధికారి ప్రతినిధి గౌరీ సతీశ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ రెండు దఫాలుగా ప్రభుత్వాన్ని కొనసాగించిన సమయంలో రైతులు వరివేస్తే ఉరే అన్నవారు ఇప్పుడు రైతుల పట్ల మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నాలుగు దఫాలుగా కనీసం తీసుకున్న రుణాలు మాఫీ చేయకుండా వడ్డీలు మాఫీ చేసుకుంటూ వచ్చారని సూచించారు. రాష్ట్రంలో రైతులు అప్పుల బాధతో మరణిస్తే కనీసం పరామర్శించే దిక్కు లేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. 2లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ అయిందని, కొందరికి ఇతర సమస్యలతో కాలేదని అలాంటి వారిని పట్టుకొని రుణమాఫీ ఏదీ అని అడగడం సిగ్గుచేటన్నారు. రుణమాఫీ కాని వారి కోసం ప్రభుత్వం మళ్లీ అధికారుల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుందన్నారు. ఇకనైనా మంచి పనులకు అందరూ సహకరించి అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఎస్‌యూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్, ఎంఎస్‌యుఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, నాయకులు శేఖర్, గంగాధర్, తదితరులు ఉన్నారు.



బోధునంపల్లిలో బోనాల ఊరేగింపు



కొత్తూరులో..

కనుల పండువగా పోచమ్మ బోనాలు

కేశంపేట: మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలను గ్రామస్తులు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో పాడి పంటలు, పిల్లలు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కులతో బోనాలు, తొట్టెలను సమర్పించారు. బోనాల నిర్వహణకు గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నీల పాండు, పిప్పళ్ల శేఖర్, లింగారెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: పట్టణంలో పోచమ్మ బోనాల ఉత్సవాలను గురువారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపులో కళాకారులు దేవతలు, పోతురాజుల వేషధారణలతో చేసిన నృత్యాలు పలువురినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం శివసత్తుల ఆటాపాటలతో పోతురాజుల నృత్యాలతో బోనాలను ఊరేగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములవ్వాలి



విద్యార్థికి సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ అందజేస్తున్న డా.వెంకటరమణ

మొయినాబాద్, రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యతో ఉద్యోగాలు చేస్తూ సమాజసేవలో పాలు పంచుకోవాలని తెలంగాణ సాంకేతిక విద్యా వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల జోగినిపల్లి బీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.వెంకటరమణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి గ్రాడ్యుయేషన్ ఉన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, గోల్డ్ మెడల్ అందజేశారు. కార్యక్రమంలో జేబీఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ ప్రొఫెసర్ గాయత్రి, జేఎన్టీయూ యూనివర్సిటీ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌అండ్‌డీ సెక్షన్ చైర్మన్ డాక్టర్ రమణనాయక్, బానోత్‌బాల ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌మూర్తి, కన్వీనర్ శేషగిరి, డీన్‌పీ రమేశ్, హెచ్ఓడీ ప్రసాద్, అబ్దుల్‌రహీం, గోవర్ధన్, ప్రభాకర్, జోత్స్న, నవీన్, శ్రీనివాసరావు, అకాడమిక్ డీన్ శ్రీనివాసరావు, కంట్రోలర్ రాజేశ్, ఏఓ శ్రీనివాస్, దినేశ్, సయ్యద్, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.



సత్యనారాయణచారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కేటీఆర్

బీఆర్ఎస్‌లో చేరిక

చేవెళ్ల: మండలంలోని అల్లవాడ మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి కాంగ్రెస్ పార్టీని వీడి సొంత గూడు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చేవెళ్లలో గురువారం బీఆర్ఎస్ పార్టీ రైతు నిరసన దీక్షలో మాజీ మంత్రి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా ఆలూరు గ్రామానికి చెందిన యూత్ నాయకుడు తోట చంద్రశేఖర్ కూడా సొంత గూటికి చేరారు. తోట చంద్రశేఖర్‌కు కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- రైతాంగ ప్రయోజనాలు కేసీఆర్‌తోనే సాధ్యం
- రైతుధర్నాలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి



షాద్‌నగర్‌లో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

షాద్‌నగర్: రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. గురువారం షాద్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో రుణమాఫీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. ప్రజల ఆలోచనకు అనుగుణంగా కేసీఆర్ పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించి నెంబర్‌వన్ స్థానంలో నిలిపారన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో ప్రజలకు, రైతాంగానికి అమలు కాని ఎన్నో ఉచిత హామీలు ఇచ్చి గెలిచారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి ఎక్కడా సరైన నిధులు కేటాయించలేదని, చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చెబుతున్న రుణమాఫీ లెక్కలకు వాస్తవంగా జరిగిన రుణమాఫీకి చాలా వ్యత్యాసం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగానికి చేసిన ద్రోహం త్వరలో బయటికి వస్తుందన్నారు. రైతుల సంక్షేమం కేవలం కేసీఆర్ తోనే సాధ్యమన్నారు.

రుణమే తీసుకోలేదు.. మాఫీ ఎలా అవుతుంది: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

తాను అసలు వ్యవసాయ రుణమే తీసుకోలేదని కాని రుణమాఫీ జరిగిందని కొందరు నాయకులు మాట్లాడటం మంచి పద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. తాను కారు కొనుగోలు చేసినప్పుడు బ్యాంకులో రుణం తీసుకున్నానని, ఆ రుణాన్ని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తన వేతనం నుంచి చెల్లించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం చెందారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, ఈట గణేశ్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, తాండ్ర వెంకట్‌రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, భీష్వరామకృష్ణ, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, జూపల్లి శంకర్, అద్దు, అంతయ్య, మురళీధర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్, యాదగిరి, నర్సింలు, రఘునాథ్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, మన్నె నారాయణయాదవ్, నక్కల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

షాబాద్: అర్హులైన రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో వంద వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేవెళ్లలో కేటీఆర్ నిర్వహించే రైతు ధర్నాకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, రాజేందర్‌గౌడ్, వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాంరెడ్డి, పాండురంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

హామీలను నిలబెట్టుకోవాలి

కొందుర్గు: రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చౌదరిగూడలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, వెంకటేశ్, బాబురావు, జహంగీర్, నర్సింలు పాల్గొన్నారు.



షాబాద్ నుంచి రైతు ధర్నాకు ర్యాలీగా తరలివెళ్తున్న నాయకులు



కొందుర్గు: చౌదరిగూడ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు